https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 322 ఆదివారం 8-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల చరిత్ర..

# చెరిపేస్తే చెరిగేదా?

**వికారాబాద్, తాండూరు, పరిగికి గోదావరి నీళ్లు.. పరిగిలో ప్రజాపాలన సభలో సీఎం**



**వికారాబాద్,ఫిబ్రవరి 7 :** "కేసీఆర్ చరిత్రను రూపుమాపేందుకు నేను ప్రయత్నిస్తున్నానంటూ హరీశ్‌రావు, కేటీఆర్ నన్ను విమర్శిస్తున్నారు. కానీ, కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల చరిత్ర నేను చెరిపేస్తే చెరిగేదా? అంతేకాదు.. కేసీఆర్‌పై దొంగనోట్ల కేసు నమోదయిందని వారి పక్కనున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మీ దొంగనోట్ల చరిత్ర నేను చెరిపేస్తే చెరిగేదా? దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్ర నేను చెరిపేస్తే పోతుందా? మీ చరిత్రను ఎవరూ చెరిపేయలేరు. ఆ చరిత్ర చెరిగిపోకుండా చూసే బాధ్యత నాది. అవసరమైతే పరిగిలో గోడల మీద రాయిస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిగిలో జరిగిన ప్రజాపాలన- ప్రగతిబాట సభలో సీఎం ప్రసంగించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, ఆ వర్గం వారికి మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి.. కేసీఆర్ మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దళితులకు స్పీకర్ పదవితోపాటు నాలుగు మంత్రి పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులిస్తే.. తెలంగాణ జాతిపితకు నోటీసులిస్తున్నారంటూ పెద్ద రాద్ధాంతం చేశారని సీఎం తప్పుబట్టారు. చిల్లర పనులు చేస్తే నోటీసులివ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు.

**బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందాలు..**

తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ కుట్రపన్ని చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నాయని సీఎం రేవంత్ ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ ఫారాలను బీఆర్ఎస్ ఆఫీసులో తెచ్చుకుంటున్నారని అన్నారు. పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, పన్నెండేళ్లుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏనాడూ స్థానిక సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. "బీజేపీ నాయకులు మోదీ ఫొటో చూపిస్తూ ఓట్లు అడుగుతున్నారు. ఎవరైనా పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తారా? ప్రధాని మోదీని చూసి ఓటేస్తే.. గల్లీలో ఉండే బోడిగాడు పనిచేయకపోతే ఢిల్లీకి వెళ్లి అడగాలా?" అని రేవంత్ ప్రశ్నించారు.

## మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్..

**ప్రవాస భారతీయల సమావేశంలో మోదీ**



**కౌలాలంపూర్:** మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్‌లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగా సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. ఇండియాను ఒక పెద్ద మార్కెట్‌గానే గతంలో చూసేవారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు. మలేసియాను ప్రపంచంలోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్-మలేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందరికీ తెలిసిందేనని అన్నారు. భారత్‌కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు.

## మావోయిస్టులకు

# ఎదురుదెబ్బ...

**51 మంది లొంగుబాటు**





బస్తర్: మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ జిల్లా బస్తర్ డివిజన్‌లో 51మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై రూ.1.61 కోట్ల రివార్డు ఉంది. వీరంతా బస్తర్ ఎస్పీ జితేందర్ యాదవ్ సమక్షంలో శనివారం నాడు లొంగిపోయారు. బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయమైన జగదల్‌పూర్‌లో బస్తర్ పాండుమ్ 2026 ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి అమిత్‌షా రాయపూర్ వచ్చిన రోజునే ఇంత పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా, బీజాపూర్ జిల్లాలో 20 మంది మహిళా క్యాడర్‌తో సహా 30 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మరో 21 మంది సుక్మా జిల్లాలో లొంగిపోయారని ఎస్పీ సుందరరాజ్ తెలిపారు. వీరిలో 14 మంది మహిళా క్యాడర్ ఉన్నారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి కార్డెక్స్ వైర్లు, జెలటిన్ స్టిక్‌లో స్వాధీనం చేసుకున్నామన్నారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు రూ.50వేల తక్షణ సాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పునరావాస చర్యలతో స్వచ్ఛందంగా వీరంతా లొంగిపోయినట్టు చెప్పారు. కాగా, తక్కిన మావోయిస్టు క్యాడర్ కూడా హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని, వారికి భద్రత, గౌరవంగా జీవించేందుకు అవసరమైన పునరావసం కల్పిస్తామని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ కోరారు.

## క్వాంటం టెక్నాలజీకి కేంద్రంగా

# అమరావతిని మారుస్తాం

**సీఎం చంద్రబాబు**



**అమరావతి:** ఏపీని సాంకేతికంగా అగ్రగామి రాష్ట్రంగా నిలిపే దిశగా శనివారం కీలక అడుగు పడింది. రాజధానిలోని ఉద్దండరాయుని పాలెంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు భారతదేశానికీ ఇదొక చరిత్రాత్మక దినమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఇవాళ క్వాంటం వ్యాలీ భవనాలకు మాత్రమే పునాది వేయటం లేదని, గ్లోబల్ క్వాంటం రెవల్యూషన్‌లో భాగమయ్యే నిపుణులకు కూడా పునాది వేసుకుంటున్నామని వ్యాఖ్యానిం చారు. ఐక్య రాజ్యసమితి కూడా ఈ ఏడాదిని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీగా ప్రకటించిందని గుర్తు చేశారు. ఇది క్వాంటం ట్రాన్సిషన్ మూమెంట్‌గా నిలిచిపోతుందని భావిస్తున్నానని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక సామర్థ్యాలు పెరుగుతున్న నేపథ్యంలో క్వాంటం టెక్నాలజీ ఓ కీలకమైన ముందడుగు అవుతుందని అన్నారు. గతంలో వచ్చిన వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాన్ని భారత్ అందిపుచ్చుకోలేక పోయిందని అన్నారు. కానీ ఐటీ విప్లవంలో దేశం ముందడుగు వేసిందని చెప్పారు. గతంలో హైదరాబాద్‌లో ఐటీకి ప్రాధాన్యత ఇచ్చి హైటెక్ సిటీ ప్రారంభించామని గుర్తు చేశారు. అది ఓ గేమ్ ఛేంజర్‌గా మారి ఫలితాలను ఇస్తోందన్నారు. హైటెక్ సిటీ తరహాలోనే క్వాంటం టెక్నాలజీకి కేంద్రంగా అమరావతిని మారుస్తామని చెప్పారు. భారత్‌లో ఏర్పాటు చేస్తున్న తొలి అమరావతి క్వాంటం వ్యాలీని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రారంభించారన్నారు. ఇది కూడా ఓ విప్లవంగా మారుతుందని అన్నారు. సాంకేతిక విప్లవాన్ని ఆచరించే ప్రధాని నరేంద్ర మోదీ కూడా బీఎస్ఎన్ఎల్ 4జీ స్టాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఈ సాంకేతికత ద్వారా 6జీ కమ్యూనికేషన్ కూడా సాధ్యం అవుతుందని అన్నారు. ఇదే తరహాలో భారత్ నుంచి వేర్వేరు ఉత్పత్తులను ప్రపంచానికి అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఐటీ గురించి, సెల్ ఫోన్ల గురించి మాట్లాడితే తనను విమర్శించిన వారి పిల్లలు ఇప్పుడంతా ఐటీ రంగంలో అమెరికాలో స్థిరపడ్డారని అన్నారు. వచ్చే 30 -40 ఏళ్లలో ఆచరణలోకి వచ్చే అంశాలపై తానెప్పుడూ ఆలోచన చేస్తానని చంద్రబాబు అన్నారు. దానికి అనుగుణంగానే ప్రణాళికలు ఉంటాయని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకున్న దేశమే భవిష్యత్తులో అభివృద్ధి సాధించగలుగుతుందని అన్నారు. క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలకు కేంద్రంగా ఏపీ మారుతుందనీ సీఎం చంద్రబాబు చెప్పారు. క్వాంటం డిజైన్స్, క్వాంటం ఉత్పత్తులు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్‌కు అమరావతి కేంద్రం అవుతుందని చెప్పారు. డిఫెన్స్, హెల్త్ కేర్, ఎనర్జీ, ఫైనాన్స్, క్లైమేట్ మోడలింగ్ కు అమరావతి క్వాంటం వ్యాలీలో పరిశోధనలు, ఆవిష్కరణలు జరుగుతాయని అన్నారు. ఇప్పటి వరకూ అంతా అమెరికాలోని సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడేవారని, ఇక నుంచి అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి మాట్లాడుకుంటారని చెప్పారు. క్వాంటం టెక్నాలజీ కోర్స్ కోసం ఇప్పటికే 66వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఇండియాలో రిజిస్టర్ చేసుకున్న వాళ్లలో 50శాతం కేవలం ఏపీకి చెందిన వారేనని చెప్పారు. కుప్పానికి చెందిన ఓ స్టూడెంట్ బ్లడ్ ప్లజర్, పల్స్ చూసే యాప్‌ను కనిపెట్టాడని తెలిపారు. కాబట్టి ఇక్కడ ఉన్న విద్యార్థులు ఎన్నో సాధించాలని పిలుపునిచ్చారు. ఏపీలోని స్టూడెంట్స్ ఏఐని అడాప్ట్ చేసుకోవాలని అన్నారు ముఖ్యమంత్రి. క్వాంటం ఆల్గరిథమ్‌లు రాయాలని సూచించారు. అప్పుడే విద్యార్థులు గేమ్ ఛేంజర్లుగా మారుతారని చెప్పారు. ఇప్పటికే స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, సెమికండెక్టర్ సిటీ, మెడ్ టెక్ వంటివి ప్రారంభించామని వివరించారు. తిరుపతిలో స్పేస్ సిటీకి రావాలని కేంద్ర మంత్రిని కోరుతున్నానని అన్నారు. అక్కడి నుంచి త్వరలోనే శాటిలైట్లు లాంచ్ చేసే రోజూ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా రాజధాని నిర్మాణం చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. దీనికి ఇక్కడున్న రైతులే ప్రధాన భాగస్వాములని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్ గా అమరావతి తయారవుతుందని అన్నారు. ప్రపంచశ్రేణి క్వాంటం టెక్నాలజీ నగరంగా అమరావతి మారుతుందని చెప్పారు. భారత్‌లోని మొదటి 133-క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలకు ధన్యవాదాలు తెలియచేస్తున్నానని అన్నారు.

## చేతగాకపోతే రేవంత్ వైదొలగాలి



**హైదరాబాద్/పటాన్‌చెరు, ఫిబ్రవరి 7**

బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకునే దమ్ముందా..? అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సవాల్ చేశారు. సోనియా, కేసీఆర్ కుటుంబాలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఏ శక్తి అడ్డుపడుతుందో చెప్పాలని సీఎం రేవంత్‌ను డిమాండ్ చేశారు. చర్లపల్లి జైలులో కేసీఆర్‌కు చిప్పకూడు తినిపిస్తానని ఎన్నికల ముందు ప్రకటించిన రేవంత్, ఇప్పుడు ఆయనపై ఈగ వాలకుండా చూసుకుంటున్నారని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోలేకపోతే రాజీనామా చేయాలని రేవంత్‌ను డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై దర్యాప్తు అంశాన్ని రేవంత్ విజ్ఞతకే వదిలేస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవడం చేతగాక సీఎం తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. "నాటి కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుత రేవంత్ సర్కార్ మజ్లిసకు బానిసలు. ఈ రెండు పార్టీలది బానిస పాలనే. కారు స్టీరింగ్ తమ చేతిలోనే ఉంటుందని కేసీఆర్‌నుద్దేశించి నాడు అసదుద్దీన్ ప్రకటిస్తే, రావు అయినా రెడ్డి అయినా తమ కాళ్ల వద్దే ఉంటారంటూ ఇప్పుడు అక్బరుద్దీన్ అంటున్నారు"అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సొంత అల్లుడిని కూడా కేసీఆర్ వదల్లేదని, ఈ విషయాన్ని స్వయంగా కవితనే చెప్పిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇంద్రేశం మునిసిపాలిటీ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో అసైన్డ్, ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని ఆరోపించారు.

## హెచ్-1బీ వీసాలపై ఆధారపడాల్సిన

# అవసరం లేదు...

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్య**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 :** ఐటీ రంగం అభివృద్ధి కోసం హెచ్-1బీ వీసాలపై ఆధారపడాల్సిన అవసరం ఇక ఎంతమాత్రం లేదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తాజాగా వ్యాఖ్యానించారు. గ్లోబల్ మార్కెట్స్‌లో భారత ఐటీ సంస్థల కార్యకలాపాల్లో చాలా మార్పు వచ్చాయని అన్నారు. ఓ జాతీయ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్-1బీ వీసాలపై అమెరికా నుంచి ఏమైనా హామీలు వచ్చాయా? అన్న మీడియా ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. వీసాల అవసరం క్రమంగా తగ్గుతూ వస్తోందని మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. కరోనా సంక్షోభానికి ముందే ఈ ఒరవడి ప్రారంభమైందని చెప్పారు. హెచ్-1బీ వీసా లాటరీ కారణంగా పలు సంస్థలు స్వల్ప సంఖ్యలో ఉన్న వీసాల కోసం అధికంగా దరఖాస్తులను సమర్పించాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. కొవిడ్ తరువాత ప్రపంచం ఎంతో మారిపోయిందని, నాటి రోజులు ఎప్పుడో పోయాయని వ్యాఖ్యానించారు. హెచ్-1బీ వీసా అంశంపై అమెరికాతో చర్చించాలని తనను ఏ కంపెనీ కరోనా సంక్షోభం తరువాత అభ్యర్థించలేదని మంత్రి తెలిపారు. ఒకప్పుడు అమెరికాలో ఆన్‌సైట్‌లో చేసిన పనిని భారత్ నుంచే రిమోట్‌గా చేయొచ్చన్న విషయాన్ని కంపెనీలు గుర్తించాయని అన్నారు. అమెరికాలో హెచ్-1బీ వీసా ఉద్యోగులకు సంస్థలు భారీగా జీతాలు చెల్లించాల్సి వచ్చేదని కూడా అన్నారు.

# ఎంపీ పప్పూ యాదవ్ అరెస్టు..

**పాట్నా:** పూర్ణియా పార్లమెంటు సభ్యుడు పప్పూ యాదవ్ (ఘ్రఖజూజూబ ్ఘఝఖజ)ను పాట్నా పోలీసులు ఆయన నివాసంలో అరెస్టు చేశారు. 1995 నాటి వివాదాస్పద భూముల కేసులో శుక్రవారం రాత్రి ఈ అరెస్టు జరిగింది. పాత ఐపీసీ (ప్రస్తుతం భారతీయ న్యాయ సంహిత) సెక్షన్లు 419, 420, 468, 448, 506, 120దీ కింద ఆయనపై గర్దానీబాగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు పాట్నా ఎస్పీ భానుప్రతాప్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ జరుగుతోందని, షెడ్యూల్ తేదీకి కోర్టు ముందు హాజరుకావడంలో ఎంపీ విఫలమయ్యారని, దీంతో ఈ అరెస్టు జరిగిందని చెప్పారు. పప్పూయాదవ్‌కు వైద్య సదుపాయాలు కల్పించడంతోపాటు, ఒక కేర్‌టేకర్‌ను కూడా అనుమతించినట్టు సింగ్ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టు ముందు హాజరుపరుస్తామని చెప్పారు. ఆరుసార్లు ఎంపీగా ఉన్న రాజేష్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో పూర్ణియా నియోజకవర్గం నుంచి గెలుపొందారు. పప్పూయాదవ్ అరెస్టును లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి, పార్లమెంటు సభ్యురాలు ప్రియాంక గాంధీ వాద్రా ఖండించారు. నితీశ్ కుమార్ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. న్యాయం కోసం నిలబడే పప్పూ యాదవ్‌ను రాజకీయ కక్షతోనే అరెస్టు చేసినట్టు రాహుల్ ఆరోపించారు. నీట్ అభ్యర్థిని అనుమానాస్పద మృతిపై న్యాయం అడిగినం దుకే ఆయన అరెస్టు జరిగిందన్నారు. జవాబుదారీతనాన్ని ప్రశ్నించిన వాళ్ల గొంతు నొక్కుతున్నారని, భయపెడుతున్నారని ఆరోపించారు. పప్పూ యాదవ్ అరెస్టును ప్రియాంక గాంధీ ఖండించారు. అన్యాయం, అణచివేతలకు పాల్పడటమే బీజేపీ, భాగస్వామ్య పార్టీల ఎజెండాగా మారిందన్నారు. కాగా, నీట్ అభ్యర్థిని మరణంతో పప్పూ యాదవ్ తరచు జహానాబాద్ వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించేవారు. పోలీసు విచారణను కూడా ఆయన బహిరంగంగానే ప్రశ్నించేవారు. తొలుత ఈ కేసుపై బిహార్ పోలీసులు 'సిట్'ను ఏర్పాటు చేశారు.

### శాంతియుత వాతావరణంలో

## ఎన్నికలు జరగాలి : డిసిపి భాస్కర్




**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 07, (మన సమాజం):**
మున్సిపల్ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఈ నెల 11వ తేదీన జరిగే ఎన్నికల నేపథ్యంలో కౌంటి ంగ్ హాల్, పోలింగ్ బాక్స్ లు భద్రపరచు కేంద్రాలను ఎసిపి రవికుమార్ తో కలిసి శనివారం పరిశీలించారు. భద్రత కేంద్రం చుట్టూ కంచె ఏర్పాటు చేసి పటిష్టమైన బందోబస్తు కల్పించాలని పోలీస్ యంత్రాంగానికి సూచించారు. ఎన్నికల కోడ్ ను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఆయన వెంట మందమర్రి సిఐ రమేష్, పట్టణ ఎస్సై శ్రీధర్, మున్సిపల్ ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

## చిరు వ్యాపారులపై అన్యాయం జరిగితే సహించను

### జేసీబీలకు అడ్డుగా నిలుస్తా : మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య





**బెల్లంపల్లి ఫిబ్రవరి 7 మన సమాజం**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాపారుల నుంచి ప్రచారానికి భారీ స్పందన లభించింది.రోడ్డు విస్తరణ పేరుతో కాంటాక్ట్ చౌరస్తా వరకు చిరు వ్యాపారాలు కోల్పోయిన వ్యాపారులకు ఇప్పటివరకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించకపోవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. దీంతో చిరు వ్యాపారుల కుటుంబాల జీవనోపాధి తీవ్రంగా ప్రభావితమైందన్నారు.బెల్లంపల్లి బజార్ ఏరియాలో విస్తరణ పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తే, జేసీబీలు తీసుకువచ్చి కూల్చివేతలకు ప్రయత్నిస్తే తానే ముందుండి అడ్డుకుంటానని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్పష్టం చేశారు, బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగ ఉండి,ఈ ఎన్నికల్లో 34 వార్డులలో బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

## నృత్య ప్రతిభను చాటిన విద్యార్థులు




**లక్షెట్టిపేట ఫిబ్రవరి07(మన సమాజం)**



అరుణాచల నృత్యోత్సవంలో లక్షెట్టిపేట ,జన్నారం ప్రాంతాలకు చెందిన నాటరాజ కళా క్షేత్రం విద్యా ర్థులు అద్భుత ప్రదర్శ నలతో ఆకట్టుకు న్నారు. అరుణా చలంలోని లంబోదర అకాడమీ ఆధ్వ ర్యంలో జన వరి 31న నిర్వహించిన ఉత్సవంలో విద్యార్థులు తమ నృత్య ప్రతిభను చాటారు. గురువు గాజుల నర్మదా మార్గదర్శ కత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులు సాంప్రదాయ శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శి ంచి ప్రేక్షకులను అలరిం చారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల నైపుణ్యం, భావప్రకటన, లయాత్మక ప్రదర్శనలు నృత్యోత్సవానికి మరింత శోభను చేకూర్చాయి. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. నాటరాజ కళాక్షేత్రం అందిస్తున్న సేవలను, గురువు నర్మదా శిక్షణను తల్లిదండ్రులు, కళాప్రియులు కొనియాడారు. భవిష్యత్తులో విద్యార్థులు కళారంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.

# విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### వసతిగృహం సంక్షేమ అధికారి సుజాతకు షోకాజ్ నోటీస్

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి ఫిబ్రవరి 7 మన సమాజం**
సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల షెడ్యూల్డ్ కులాల సమీకృత బాలికల వసతి గృహంలో అస్వస్థతకు గురై మండల కేంద్రంలోని ప్రభుత్వ కెమికల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం వసతి గృహ భవనాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా షెడ్యూలు కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి సందర్శించి వసతి గృహ వార్డులు, వంటశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తుందని తెలిపారు. శు క్రవారం రాత్రి భోజనం అనంతరం 16 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించడం జరిగిందని, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థినులు పూర్తిగా కోలుకున్నారని, శనివారం సాయంత్రం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేస్తారని తెలిపారు. ఈ చర్య పై వసతి గృహ సంక్షేమ అధికారి సుజాత కు షోకాజ్ నోటీస్ జారీ చేయడం జరిగిందని, వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్..




**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 07, (మన సమాజం):**
ఎన్నికలు సమీపిస్తున్న వేళ క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ దూసుకుపోతుంది. ప్రచారానికి మరో రెండు రోజులు మాత్రమే ఉండగా 3, 17,18,7,9, వార్డులలో అభ్యర్థులు మంతెన మల్లమ్మ, చంద్రగిరి లావణ్య - శ్రీనివాస్, పల్లె శ్రీదేవి-రాజు, పొలం సత్యనారాయణ, బీమ మల్లేష్ ఆయా వార్డులలో శనివారం ప్రచారం హోరెత్తించారు. పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై అసత్యపు ప్రచారాలు చేస్తున్న కమ్యూనిస్ట్ నాయకుడు సీతారామయ్య కార్మికుల కోసమే పోరాటాలు చేసే నీకు కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయని ప్రశ్నించారు. కార్మిక హక్కులను కాపాడి ఉద్యోగ భద్రత కల్పించింది తమ యూనియన్ ఐ ఎన్టియుసి అని గుర్తు చేశారు. చెన్నూరు నియోజకవర్గంలో కాకా వెంకటస్వామి కుటుంబం నుండి ఇప్పటి ఎమ్మెల్యే మంత్రి వివేక్ చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని, క్యాతనపల్లిలో ఆర్వోబి తీసుకొచ్చింది వివేక్ అని మరోసారి గుర్తుచేశారు. కోట్ల రూపాయల నిధులతో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. 22 వార్డులలో పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థులను గెలిపించి మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదం చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

# 20వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తా..

### స్వతంత్ర అభ్యర్థి నడిగోట తిరుపతి..



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 07, (మన సమాజం):**
క్యాతనపల్లి మున్సిపాలిటీ 20వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ఆ వార్డు స్వతంత్ర అభ్యర్థి నడిగోట తిరుపతి అన్నారు. ఎన్నికల్లో బాగంగా 20వ వార్డులో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో గత పాలకులు చేసిన అభివృద్ధి ఏమి లేదని, ఈ ఎన్నికల్లో కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే మున్సిపాలిటీలోనే 20వ వార్డును అగ్రగామిగా నిలుపుతాననని హామీ ఇచ్చారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిగిలోకి నిలిచానని వార్డు ప్రజలు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని కోరారు. ప్రచారంలో రజక సంఘం సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీపై ఉక్కుపాదం



భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వీబీ జీ రామ్ జీగా మారుస్తూ కేంద్రం ఇటీవల కొత్త చట్టాన్ని తెచ్చింది. ఒక చట్టాన్ని రూపొందించేటప్పుడు విధివిధానాల రూపకల్పన సమగ్రంగా ఉండాలి. కానీ ఉన్న పథకానికి తూట్లు పొడుస్తూ తెచ్చిన కొత్త చట్టం నిరుపేదల పొట్టకొట్టడమే కాకుండా, రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపుతోంది. దేశంలో ఆకలిచావులు ఉండకూడదనే మానవతా దృక్పథంతో, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చొరవతో-- రెండు దశాబ్దాల క్రితమే మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, వలసలను తగ్గించింది. అంతేకాదు, ఉపాధికి చట్టపరమైన హామీ కల్పించడం ద్వారా ఇది కుటుంబ ఆదాయాన్ని పెంచి, మహిళా సాధికారతకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పడింది. గ్రామీణ పేదల పాలిట ఈ పథకం ఒక భద్రతా కవచంగా నిలుస్తోంది. ఇరవయ్యేళ్ల క్రితం- 2006, ఫిబ్రవరి 2న ఉమ్మడి రాష్ట్రంలోని అనంతపురం జిల్లా బండ్లపల్లికి వచ్చి, ప్రధాని మన్మోహన్ స్వయంగా ఈ పథకాన్ని ప్రారంభించారు.'కాంగ్రెస్ అంటే ఉపాధి హామీ.. ఉపాధి హామీ అంటేనే కాంగ్రెస్' అనేలా నిరుపేదల గుండెల్లో ఈ పథకం చెరగని ముద్ర వేసింది. దానిని చెరిపివేసేందుకే మోదీ సర్కార్ అవకాశవాద రాజకీయాలకు తెరలేపింది. కొత్త చట్టం ద్వారా పని దినాలను 125కు పెంచడమే కాకుండా, రోజువారీ వేతనం పెంచుతున్నామని ప్రగల్భాలు పలుకుతున్న కేంద్రం, ఉపాధి హామీ కార్మికులకు చెల్లించే వేతనాల ఖర్చులో 40శాతం భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై మోపాలనుకోవడం ఆక్షేపణీయం. గతంలో 90శాతం ఖర్చును కేంద్రం భరించగా, కేవలం 10శాతం మాత్రమే రాష్ట్రాలు భరించేవి. తెలంగాణ విషయానికి వస్తే.. 2025--26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనిదినాలను 8 కోట్ల నుంచి 6.5 కోట్లకు కేంద్రం కుదించింది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ సర్కార్ 12 కోట్ల పనిదినాలు కోరితే, వాటిని సగానికి తగ్గించడమే కాకుండా రావాల్సిన నిధుల్లో కోత విధించడం గర్హనీయం. నిబంధనల పేరుతో కేంద్రం విధిస్తున్న ఆంక్షలు రాష్ట్ర ఉపాధి రంగాన్ని కుదిపేస్తున్నాయి. బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులను గణనీయంగా తగ్గించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో అమలుకు అసాధ్యమైన నిబంధనలను రుద్దుతోంది. కొత్తగా ప్రవేశపెట్టిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా రోజుకు రెండుసార్లు ఫొటోలు తీయాలనే నిబంధన, సిగ్నల్ లేని మారుమూల ప్రాంతాల్లోని కూలీలకు శాపంగా మారింది. చిన్నపాటి సాంకేతిక కారణాలను సాకుగా చూపి, తెలంగాణకు రావాల్సిన వందల కోట్ల రూపాయల బకాయిలను కేంద్రం నిలిపివేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేసి, 'కల్లాలు' నిర్మించుకుంటే, దానిని నిబంధనల ఉల్లంఘనగా పేర్కొంటూ రూ.150 కోట్లకు పైగా నిధులను తిరిగి చెల్లించాలని రాష్ట్ర సర్కారుకు నోటీసులు ఇవ్వడం గమనార్హం.

MANA SAMAJAM
మన సమాజం
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఆదివారం, ఫిబ్రవరి 8, 2026


# నిర్మలమ్మకు కనిపించని ప్రజా జీవిత వాస్తవాలు

ఈ నెల 1న లోక్‌సభలో 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత ఆ వార్షిక పద్దుపై ప్రభుత్వ ప్రతినిధులు, సంపాదకీయ రచయితలు, ఆర్థిక వ్యవహారాలపై వ్యాఖ్యాతలు, పాత్రికేయులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ 'జాగరూకత' అనే పదాన్ని, 'ఉన్న స్థితిని చెదరగొట్టి తలకిందులు చేయవద్దు' (డోంట్ రాక్ ది బోట్) అనే పదబంధాన్ని ఉపయోగించారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఆర్థిక సర్వే 2025--26 గుర్తించింది; అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన సుంకాల సమరం భారత్ సరుకులపై విధించిన 50శాతం సుంకాలను 18శాతానికి తగ్గించనున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ 'తగ్గింపు'నకు షరతులు ఉన్నట్టుగా కనిపిస్తోంది. భారత్‌కు అమెరికన్ ఎగుమతులపై నయాపైసా సుంకం విధించకపోవడం, సుంకాలేతర అవరోధాలను పూర్తిగా తొలగించడం, 50,000 కోట్ల డాలర్ల విలువైన అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేయడం మొదలైనవి. ఇంకా ఇతర షరతులు ఉండవచ్చు. అయితే ఈ షరతులను పాటించడం భారత్‌కు సాధ్యం కాకపోవచ్చు. దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావలసిన స్థాయిలో రావడం లేదు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపుదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. నగదు సమృద్ధిగా ఉన్న భారతీయ వ్యాపారవేత్తలు మదుపు చేసేందుకు సంకోచిస్తున్నారు. పర్యవసానంగా 'స్థూల స్థిర మూలధన సంచయం' భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 30శాతంగా మాత్రమే ఉండిపోయింది. నామమాత్ర జీడీపీ వృద్ధిరేటు అసంతృప్తికరంగా ఉన్నది. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ) అనుసరించిన గణన పద్ధతులు, జాతీయ ఖాతాలపై అంతర్జాతీయ సంస్థల సందేహాలతో యథార్థ జీడీపీ వృద్ధిరేట్లపై అనుమానపు నీడలు కమ్ముకున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ నిజ స్థితిగతులను అంచనా వేసేందుకు నామమాత్ర జీడీపీ ఒక మంచి సూచకం. ఇది 2023--24, 2024--25, 2025--26 ఆర్థిక సంవత్సరాలలో వరుసగా 12శాతం, 9.8శాతం, 8శాతం మేరకు పెరిగింది. ఏమైనా వృద్ధి వేగాన్ని కోల్పోతోంది సుమా! నిరుద్యోగిత పెరిగిపోయింది. జూన్ 2025లో యువజనుల నిరుద్యోగిత రేటు 15శాతంగా ఉన్నది. దేశ శ్రామిక జనవాళిలో 21.7శాతం మంది మాత్రమే క్రమబద్ధమైన వేతన ఉద్యోగాలలో ఉన్నారు. లక్షలాది యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారు. ఈ నిరుద్యోగులు స్వయం ఉపాధి వైపునకు మళ్లుతున్నట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తయారీ రంగంలో అగ్రగామి కాకుండా ఏ దేశమూ మధ్య ఆదాయ దేశంగా రూపొందదు. భారతదేశ జీడీపీలో తయారీరంగం వాటా గత పది సంవత్సరాలుగా 15 లేదా 16 శాతంగా మాత్రమే ఉంటోంది. పీఎల్ఐ, ఇతర పథకాలు ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమయ్యాయి; ద్రవ్య సమీకరణ బాధాకరంగా మందగించింది. ద్రవ్యలోటు 2025--26లో 4.4 శాతం నుంచి 2026--27లో 4.3శాతానికి తగ్గనున్నది. రెవెన్యూ లోటు 1.5శాతంగా ఉండిపోనున్నది. ఎఫ్ఆర్‌బీఎమ్ లక్ష్యాలను చేరుకునేందుకు 12 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పట్టవచ్చు. అందుకు మనం భారీ మూల్యమే చెల్లించనున్నాము. ప్రభుత్వ ఆర్థిక సలహాదారు, ఆర్థిక సర్వే మొదటి అధ్యాయంలోనే 'జాగ్రత్తగా ఉండాలి. అయితే నిరాశావాదం అవసరం లేదు' అని సూచించారు. ఈ ఆశావహ దృక్పథమే ఆ నివేదిక అంతటా కనిపించింది. మరో అధ్యాయంలో ప్రభుత్వం విశ్వసనీయమైన పద్ధతుల ద్వారా ప్రభుత్వ రుణాలను తగ్గించుకోవాలని, జీడీపీ--రుణాల నిష్పత్తిని కూడా బాగా తగ్గించుకోవాలని సూచించారు. పట్టణీకరణ విషయంలో మెట్రోపాలిటన్ పాలనా వ్యవస్థలను పటిష్ఠపరచాలని, సమృద్ధిగా నిధుల కేటాయింపులతో నగరాలకు ఆర్థిక సాధికారత కల్పించాలని పేర్కొన్నారు. పట్టణీకరణ విషయంలో ఆయన దృక్పథం సాహసోపేతంగా ఉందని చెప్పవచ్చు. 2025--26 ఆర్థిక సంవత్సరపు పన్నుల జూదం విఫలమయింది. గత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ నుంచి డివిడెండ్ రూపంలో ఉదారంగా అందిన దాదాపు రూ.3,04,000 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో అంకెలు ఘనంగా కనిపించేందుకు దోహదం చేశాయి. అంతకు ముందు రెండు ఆర్థిక సంవత్సరాలలో ఆర్బీఐ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్‌గా వరుసగా రూ.2,10,874 కోట్లు, రూ.2,68,590 కోట్లు సమకూరాయి. యూపీఏ ప్రభుత్వాల హయాం (2004--14)లో రిజర్వ్ బ్యాంక్ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో సమకూరిన గరిష్ఠ మొత్తం (2013-14లో) రూ.52,679 కోట్లు. తన ప్రధాన సలహాదారు రూపొందించిన ఆర్థిక సర్వేకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిస్పందన అస్పష్టంగా ఉన్నది. తన 85 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించిగానీ, సుంకాలు, నిర్బంధ వాణిజ్య ఒప్పందాల రూపేణా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ చేస్తోన్న ద్విముఖ దాడి గురించి ఆమె ఎటువంటి వ్యాఖ్య చేయలేదు! అంతకంతకూ మహా శక్తిమంతమవుతోన్న చైనా ఆర్థిక వ్యవస్థ గురించిగానీ, ఆర్థిక వ్యవహారాలపై మెరుగైన అవగాహన ఉన్నవారు బడ్జెట్ నుంచి ఆశిస్తున్న విషయాలపైగానీ ఆమె ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఆర్థిక మంత్రిగానీ, ప్రభుత్వంగానీ ఆర్థిక సర్వేను లెక్కలోకే తీసుకోలేదు-- ఇది నేను ఉదారంగా చేస్తున్న విమర్శ. 'మనం సౌర వ్యవస్థలోని ఒక గ్రహ వాసులమని ప్రస్తుత పాలకులు భావించడం లేదు' అనేది నేను నిర్దయగా చేసే విమర్శ. మందగించిన వృద్ధిరేటు, పేదరికం, పెరుగుతున్న అసమానతలు, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, సంక్షేమంపై నిర్లక్ష్యం, రూపాయి విలువ తగ్గుదల మౌలిక సదుపాయాలు, అత్యవసర సేవల విషయంలో గిరాకీ, సరఫరాల మధ్య అంతరాలతో దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అనుసరించనున్న విధానాలు ఏమిటో ఆర్థికమంత్రి తన ప్రసంగంలో వెల్లడించకపోవడం నన్ను నిర్ఘాంతపరిచింది. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని ఆర్థికరంగ నిపుణులు తీవ్రంగా విమర్శించారు. భారత్-- ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకుంటూ ప్రభుత్వం తనను తాను అభినందించుకోవడాన్ని డాక్టర్ సూర్జిత్ భల్లా ఎగతాళి చేశారు. వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని డాక్టర్ అశోక్ గులాటి గర్హించారు. ఆర్థికమంత్రి తన ప్రసంగంలో అనేక పథకాలు, కార్యక్రమాలు, మిషన్‌లు, సంస్థలు, చొరవలు, ఫండ్స్, కమిటీలను ప్రస్తావించారు.

# మత జాతీయవాదం భారత్‌కు మేలు చేసేనా?

'పాకిస్థాన్ తన ముస్లిమేతర పౌరులను ఎంతగా దురవస్థలకు గురి చేసినా మనం మన మైనారిటీ మతస్థులపట్ల నాగరీక రీతిలో వ్యవహరించాలి. మన అల్పసంఖ్యాక వర్గాలకు పూర్తి భద్రత కల్పించి, ఒక ప్రజాస్వామిక రాజ్యంలో పౌరులకు ఉండే హక్కులు అన్నిటినీ మన ముస్లిం మైనారిటీలకు ఇవ్వాలి'-- 1947 అక్టోబర్ 15న ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఉద్ఘాటించిన మాటలవి. లౌకికవాదం, మైనారిటీలకు సమానహక్కుల విషయంలో నెహ్రూ నిబద్ధతకు కాంగ్రెస్ పార్టీలోనే సంపూర్ణ ఆమోదం లేదు. స్వతంత్ర భారతదేశ తొలి సంవత్సరాలలోనూ, ఆ తరువాత తన జీవిత పర్యంతం కాంగ్రెస్‌లోనూ, విశాల భారతీయ సమాజంలోనూ మితవాద హిందూ శక్తుల ప్రభావాన్ని సమర్థంగా ప్రతిఘటించేందుకు ప్రధాని నెహ్రూ నిరంతరం కృషి చేశారు. ఆయన మరణానంతర దశాబ్దాలలో మాత్రమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనసంఘ్, ఈ పార్టీ ప్రస్తుత అవతారమైన భారతీయ జనతా పార్టీ తమ ప్రభావ ప్రాబల్యాలను పెంచుకున్నాయి. దేశ విభజన అనంతరం భారత్ లౌకికవాద రాజ్యాంగాన్ని రూపొందించుకుని బహుళత్వ, సమ్మిళిత భారతదేశ నిర్మాణాన్ని లక్ష్యంగా ఔదలదాల్చింది. దేశ పాలనా వ్యవహారాలు మత ప్రమేయం లేకుండా జరిగేందుకు తొలి ప్రధాని నెహ్రూ సుస్థిర పునాదులు వేశారు. అయితే మతాన్ని రాజ్య వ్యవహారాలతో మిళితం చేసిన మార్గాన్ని అనుసరించిన పాకిస్థాన్‌కు భారత్ ఇప్పుడు ఆ విషయంలో చేరువవుతోంది! మెజారిటీవాద ధోరణి ప్రస్తుత పాలకపక్షం వ్యవహారాలలో స్పష్టంగా కనిపిస్తోంది. గత మూడు సార్వత్రక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ తరఫున లోక్‌సభకు ఎన్నికైన 800 మందికి పైగా ప్రజా ప్రతినిధులలో ముస్లిం మతస్థులు ఒక్కరూ లేరు! నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ హిందూ ఓటు బ్యాంకును సృష్టించుకోవడంలో చాలావరకు సఫలమయింది. హిందూ ఓటర్ల మద్దతు ఆధారంగా తరచూ ఎన్నికలలో విజయాలు సాధిస్తోంది. హిందువులకే ప్రథమ ప్రాధాన్యమిచ్చే రాజకీయాల అజెండా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పదే పదే అధికారాన్ని కైవసం చేసుకునేందుకు తోడ్పడుతుండడంతో సంఘ్ పరివార్ భారతీయ సమాజంలో తన ప్రభావ ప్రాబల్యాలనూ ఇతోధికంగా పెంపొందించుకుంటోంది. ఈ క్రమంలో భారతీయ ముస్లింలను (అప్పుడప్పుడూ భారతీయ క్రైస్తవులను కూడా) పలు విధాలా వేధింపులకు గురిచేస్తోంది. ఆ మైనారిటీ మతస్థుల పట్ల విద్వేషాన్ని ప్రోత్సహిస్తోంది. ముస్లింలు ఒకప్పుడు కేంద్ర కేబినెట్‌లో ప్రధాన మంత్రిత్వ శాఖ లకు సారథ్యం వహించారు. దౌత్య శ్రేణులకు, గూఢచార వర్గాలకు నాయకత్వం వహించారు. భారత ప్రధాన న్యాయమూర్తులుగా దేశ న్యాయపాలనను నిర్దేశించారు. భారత వాయుసేనకు అధినేతలుగా ఉన్నారు. ఇటీవలి కాలంలో అంటే 2014కు పూర్వం నరేంద్ర మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో రెండు నగరాలు పార్లమెంటులో తమ ప్రతినిధులుగా ముస్లింలను ఎన్నుకున్నాయి. మరి ఇప్పుడో? మన ప్రజా జీవితంలో ప్రముఖ స్థానాలలో ఉన్నవారిలో ఒక్క ముస్లిం కూడా లేడు. కాయ కష్టంతో బతికే ముస్లింలను నిత్యం అనేక విధాలుగా అవమానిస్తున్నారు. ముస్లింల భారతీయ పౌరసత్వాన్ని ప్రశ్నిస్తున్నారు వారి దేశభక్తిని శంకిస్తున్నారు. వారిని లక్ష్యంగా చేసుకుని హింసాకాండకు పాల్పడుతున్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని మూకదాడులు చేస్తున్నారు. న్యాయవిరుద్ధంగా ముస్లింల గృహాలను కూల్చివేస్తున్నారు. లౌకికవాద, బహుళత్వ, సమ్మిళిత ప్రజాస్వామ్యమే భారత్ భావన హృదయం. అయితే పాకిస్థాన్‌కు పునాది అయిన మత జాతీయవాదం ప్రాతిపదికను ప్రాథమికంగా ప్రతిబింబించే ఆధిపత్యవాద రాజ్యంగా భారత్‌ను రూపొందించేందుకు బీజేపీ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయి. జాతి జీవనంలోని వివిధ రంగాలలో ఇది ప్రతీకాత్మకంగాను, ఆచరణాత్మకంగాను కనిపిస్తోంది. పాలకపక్షం మాటలు, చేతలు ఆ లక్ష్య పరిపూర్తిని మరింత త్వరితం చేసేవిగా ఉన్నాయి. హిందూ మెజారిటీవాదం మే 2014 నుంచే ప్రారంభం కాలేదు. దానికి సుదీర్ఘ చరిత్ర ఉన్నది. 19వ శతాబ్దిలో హిందూ మిషనరీ సొసైటీల కార్యకలాపాలు, 20వ శతాబ్దిలో హిందూ మహాసభ రాజకీయాలు, 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భావం ఆ చరిత్రలో భాగాలే. రాజ్య వ్యవహారాలలో మత ప్రమేయం లేకుండా ఉండేందుకు నెహ్రూ నిరంతరం అప్రమత్తంగా ఉండేవారు. అయితే ఆయన మనవడు రాజీవ్‌గాంధీ షా బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా ఉత్పన్నమైన సంక్లిష్ట రాజకీయ పరిస్థితులలో అనుసరించిన విధానాలు హిందూత్వ శక్తుల ప్రభావశీలత పెరుగుదలకు ఆలంబన అయ్యాయి. పాలనా వ్యవహారాలను మత ప్రాతిపదికన నడపడంతో ముస్లిం మత తీవ్రవాదుల కంటే హిందూ మత తీవ్రవాదులు ఎక్కువగా లబ్ధి పొందారు. రాజీవ్ ప్రభుత్వం అయోధ్యలోని వివాదాస్పద బాబ్రీ మసీదు తాళాలు తెరవడంతో ఆ మసీదును కూల్చివేసి దాని స్థానంలో రామాలయాన్ని నిర్మించేందుకు సంఘ్ పరివార్ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించింది. 1984 సార్వత్రక ఎన్నికలలో కేవలం రెండే రెండు స్థానాలలో గెలిచిన బీజేపీ దశాబ్దంన్నర కాలంలో దేశంలో అగ్రగామి జాతీయ రాజకీయ పక్షంగా ఆవిర్భవించింది. బీజేపీ ప్రథమ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి పాలనా శైలిలో మెజారిటీవాద ప్రేరణలు ఉండేవి కావు. ఆయన పార్టీ అనేక సంకీర్ణ భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేయవలసి ఉండడంతో ఆయన సంయమనంతో వ్యవహరించేవారు. సార్వత్రక ఎన్నికలలో వరుసగా రెండుసార్లు మంచి మెజారిటీతో విజయం సాధించిన బీజేపీ రెండో ప్రధానమంత్రి, మూడోసారి సాధారణ మెజారిటీని సాధించుకోలేకపోయినప్పటికీ పాలనా వ్యవహారాలలో 'హిందువులకే ప్రథమ ప్రాధాన్యం అజెండా'ను అమలుపరుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రథమ కుటుంబంలోని ప్రస్తుత తరం నాయకుల కంటే బీజేపీ అగ్రనాయక ద్వయం నరేంద్రమోదీ, అమిత్ షాలే మరింతగా సైద్ధాంతిక నిబద్ధులు. అంతేకాదు, అధికారాన్ని గెలుచుకోవడం పైన, గెలుచుకున్న అధికారాన్ని నిలబెట్టుకోవడం పైన కాంగ్రెస్ నేతల కంటే వీరే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. మోదీ--షా ద్వయంతో పోలిస్తే రాజకీయాలలో రాహుల్, ప్రియాంకల ఆసక్తి, నిమగ్నత అస్థిరమైనది, అవ్యవస్థితమైనది. కాంగ్రెస్ కృశించి, క్షీణించిపోతుండగా, సంఘ్ పరివార్ ప్రభావ ప్రాబల్యాలు క్రమంగా పెరిగాయి, మరింతగా బలీయమవుతూ విస్తరిస్తున్నాయి. భారతదేశ నడుస్తున్న చరిత్రలో సువ్యక్తమవుతున్నది 'నాగరికతా పునరుజ్జీవనమే' నని హిందూ మితవాద సైద్ధాంతికులు తరచూ పెద్ద పెట్టున వాదిస్తున్నారు. ఈ వాదనలో ఇసుమంత సత్యం కూడా లేదు. భారతీయ కళలు, సంగీతం లేదా తాత్త్విక చింతనా ధోరణులు మహోన్నతమైనవి. వాటిని సమకాలీన ప్రపంచ సమస్యల పరిష్కారానికి వాటిని మరింత ఉపయుక్తంగా చేసే విషయంలో సంఘ్ పరివార్‌కు ఎటువంటి శ్రద్ధ లేదు. వారి శ్రద్ధాసక్తులు వేరే విషయాలలో ఉన్నాయి. హిందువులు కాని ఇతర భారతీయులు, ముఖ్యంగా ముస్లింల కంటే హిందువులే సమస్త జీవన రంగాలలోను అన్ని విధాల ఆధిక్యులు అన్న విషయాన్ని పదే పదే ప్రకటించడంపైన మాత్రమే శ్రద్ధ చూపుతున్నారు. నిజానికి మనం ఇప్పుడు చూస్తున్నది నాగరికతా పునరుజ్జీవనం కాదు. హిందూత్వ అజెండా ప్రేరేపిత కార్యాచరణే. నడుస్తున్న కాలంలో, మరింత స్పష్టంగా చెప్పాలంటే ఈ 2026లో భారత్ ఒక హిందూ పాకిస్థాన్‌గా ప్రభవించే సూచనలు సర్వత్రా కనిపిస్తున్నాయి. ఈ పరిణామాన్ని నివారించడం సాధ్యమవుతుందా? లౌకిక, మతపరమైనది కాని రాజ్యవ్యవస్థ భవిష్యత్తులో భద్రంగా వర్ధిల్లుతుందా? సమాధానాలు చెప్పడం అసాధ్యమైన ప్రశ్నలివి. అయితే ఇతర దేశాల అనుభవాలను పరిశీలించినప్పుడు మత విశ్వాసాలను రాజ్య వ్యవహారాలతో మిళితం చేయడమనేది ఎక్కడా సత్ఫలితాలనివ్వలేదని స్పష్టమవుతుంది. పాకిస్థాన్ తన అస్తిత్వానికి ఇస్లాంను కేంద్రంగా చేసుకున్నది. ఇది ఆ దేశ ఆర్థికాభివృద్ధికి, ప్రజాస్వామ్య పాలనా పురోగతికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది. లౌకికవాద ఆదర్శాలు పునాదిగా ప్రభవించిన బంగ్లాదేశ్ ఆ ఆదర్శాలను త్యజించింది. ఫలితంగా సంక్షోభం పాలై పలు విధాలా నష్టపోతోంది. ఒక అభివృద్ధి చెందిన దేశంగా వర్ధిల్లేందుకు ఆవశ్యకమైన ఆర్థిక, సాంస్కృతిక వనరులు ఇరాన్‌కు ఉన్నాయి. అయితే 1979లో మత ఛాందసవాద అయతొల్లాలు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు వమ్మయిపోయాయి.

# తరచూ బీర్ తాగుతున్నారా..? ఎన్ని అనర్థాలు సంభవిస్తాయో తెలుసా..?



వీకెండ్ వచ్చిందంటే చాలు యువత ఎక్కువగా బీర్ తాగుతూ వీకెండ్ వైబ్స్‌ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు. బీర్ తాగడం సరదగా ఉన్నప్పటికీ ఇది మన ఆరోగ్యానికి గణనీయమైన హానిని కలిగిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చాలా మంది బీరే కదా అని తేలికగా తీసుకుంటూ ఉంటారు. కానీ బీర్ లో కూడా ఆల్కహాల్ ఉంటుంది. ఇది మన ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. బీర్ తాగడం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. ఎముకలు బలహీనంగా తయారవుతాయి. 35 సంవత్సరాలు దాటిన తరువాత ఎముకల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మహిళలు బీర్ తాగడం వల్ల హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు తలెత్తుతాయి. నెలసరి సమస్యలు రావడం, మానసికపరమైన సమస్యలు రావడం జరుగుతుంది. పురుషులు బీర్ తాగడం వల్ల వారిలో ఛాతి పెరుగుతుంది. టెస్టోస్టెరాన్ స్థాయిలు తగ్గి ఈస్ట్రోజన్ స్థాయిలు పెరుగుతాయి. అంతేకాకుండా శరీరం శక్తి, పనితీరుతో పాటు ఆత్మవిశ్వాసం కూడా తగ్గుతుంది. బీర్ తాగడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య కూడా తలెత్తుతుంది. చాలా మంది బీర్ తాగుతూ ఎంజాయ్ చేస్తున్నామని భావిస్తూ ఉంటారు. కానీ బీర్ వల్ల మన ఆరోగ్యానికి కలిగే హాని గురించి ఎవరూ ఆలోచించరు అని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా బీర్ తాగడం వల్ల మూత్రవిసర్జన పెరుగుతుంది. దీంతో శరీరం డీహైడ్రేషన్ బారిన పడుతుంది. తలతిరగడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ లో ఉండే ఆల్కహాల్ పేగులో ఉండే పొరలను చికాకుకు గురి చేస్తుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు అధికం అవుతాయి. ఆమ్లత్వం పెరగడంతో పాటు పొట్టలో పుండ్లు కూడా ఏర్పడతాయి. బీర్ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీర్ఘకాలం పాటు బీర్ తాగడం వల్ల సిర్రోసిస్, ఫ్యాటీ లివర్, ఆల్కహాలిక్ హెపటైటిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కాలక్రమేణా మెదడు పనితీరు కూడా దెబ్బతింటుంది. అభిజ్ఞా పనితీరు క్షీణించడం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ తాగడం వల్ల గుండె ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుంది. గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయి. కనుక బీర్ ను తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. బీర్ తాగే అలవాటును ఒక్కసారిగా మానేయలేని వారు ఈ అలవాటును క్రమంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. బీర్ వంటి ఆల్కహాల్ కలిగిన పానీయాలను ఆరు నెలల పాటు తీసుకోకపోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంలో పెద్ద మార్పులను చూడవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. బీర్ ను మానేయడం వల్ల మనం అనేక ఆరోగ్యప్రయోజనాలను పొందవచ్చని మొత్తం శరీర ఆరోగ్యం మెరుగుపడుతుందని వారు చెబుతున్నారు.



## వాళ్లను విడిచి ఉండలేకపోయా!

శ్రీలీల అనగానే డాక్టర్.. యాక్టర్.. డ్యాన్సర్ అని మాత్రమే చాలామంది అనుకుంటారు. కానీ తనలో గొప్ప మానవతామూర్తి దాగున్నదని చాలామందికి తెలియదు. 24ఏండ్ల ప్రాయంలోనే ముగ్గురు పిల్లలను దత్తత తీసుకుని సాటి తారలకు ఆదర్శంగా నిలిచింది శ్రీలీల. తెరపై స్టార్ హీరోయిన్‌గా అలరిస్తూనే, తెర వెనుక బాధ్యతగల పౌరురాలిగా ప్రత్యేకతను చాటుకుంటున్న శ్రీలీల.. ఇటీవల తన దత్తత విషయంపై మాట్లాడింది. ‘అమ్మతనంలోని మాధుర్యాన్ని అమ్మను కాకుండానే అనుభవించడం గమ్మత్తుగా ఉంది. 2019లో ‘కిస్’ అనే కన్నడ సినిమా చేశాను. ఆ సినిమా షూటింగ్ ఒక ఆశ్రమంలో జరిగింది. ఆ టైమ్‌లో ఆ పిల్లలతో ఏర్పడిన అనుబంధమే దత్తతకు దారి తీసింది. ఎందుకో తెలియదు షూటింగ్ తర్వాత ఆ పిల్లల్ని విడిచి వెళ్లలేకపోయాను. వారి జ్ఞాపకాలు కొన్ని రోజులు వెంటాడాయి. 2022లో ఆ దివ్యాంగ పిల్లలను దత్తత తీసుకున్నా. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలనుకున్నప్పటికీ.. మరికొంతమందికి ఇది ప్రేరణగా నిలుస్తుందనే ఉద్దేశంతో బయటకు చెప్పాను. నిజానికి ఈ విషయం గురించి మాట్లాడేటప్పుడు నాకు మాటలు రావు. అప్రయత్నంగా నా గొంతు వణుకుతుంటుంది. ఇప్పటికీ ఆ పిల్లల్ని దగ్గరుండి చూసుకుంటున్నా. నేను వాళ్లకు అమ్మను మాత్రమే కాదు, ఫ్రెండ్‌ని కూడా ’ అంటూ భావోద్వేగానికి లోనైంది శ్రీలీల.

## ఎన్టీఆర్ లెవల్‌కు తగ్గట్లుగా ప్రశాంత్ నీల్ ప్లాన్



జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ’కేజీఎఫ్’, ’సలార్’ వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్ హీరోగా సినిమా చేస్తున్నాడు అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అందుకే ఈ మూవీకి సంబంధించిన చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లోనే వైరల్ అవుతోంది. ఈ సినిమాను పూర్తిగా ఇంటర్నేషనల్ లెవల్లో తెరకెక్కించాలని ప్రశాంత్ నీల్ గట్టిగా నిర్ణయించుకున్నారట. తన అభిమాన నటుడు అయిన ఎన్టీఆర్‌కు కెరీర్‌లో మరిచిపోలేని బ్లాక్‌బస్టర్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆయన ఎక్కడా క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావడం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. చిన్న చిన్న డిటైలింగ్ వరకు కూడా పర్ఫెక్షన్ కావాలనే ఆలోచనతో ప్రతి సీన్‌ను తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కూడా దీనిని అత్యంత ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తీసుకుంది. ఇటీవల నిర్మాత రవి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడం కూడా ఈ సినిమాపై క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పే ఉదాహరణగా మారింది. ఇటీవల హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన పాత్రల మధ్య కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అంతేకాదు, ఎన్టీఆర్‌తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ఈ షెడ్యూల్‌లోనే తెరకెక్కించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయ్యాక ఎన్టీఆర్ మరోసారి విదేశాలకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే షెడ్యూల్‌తో సినిమా టాకీ పార్ట్ దాదాపుగా పూర్తవుతుందని టాక్. గ్రాండ్ స్కేల్‌లో, భారీ యాక్షన్ ఎపిసోడ్‌లతో ఈ మూవీని ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా అందించేందుకు టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు ’డ్రాగన్’ అనే టైటిల్‌ను ఫిక్స్ చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంటర్నేషనల్ లెవల్లో సెట్ అయ్యే కథకు ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారట. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ గత సినిమాల్లో హీరో ఎలివేషన్స్, మాస్ యాక్షన్‌కు పెద్ద పీట వేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో కేవలం హీరోయిజం మాత్రమే కాకుండా బలమైన ఎమోషన్స్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ నటనలోని ఎమోషనల్ డెప్త్‌ను కొత్త కోణంలో చూపించాలనే ప్రయత్నంలో ప్రశాంత్ నీల్ ఉన్నారు.

## రాజాసాబ్‌లో నాచే నాచే సాంగ్ పెట్టాలనే ఐడియా ఎవరిది..



గ్లోబల్ స్టార్ ప్రభాస్ టైటిల్ రోల్ పోషిస్తోన్న చిత్రం రాజాసాబ్ మారుతి డైరెక్షన్‌లో పాన్ ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ సినిమాలో మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్, రిద్ధికుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది మారుతి అండ్ ప్రభాస్ టీం. ఈ మూవీ నుంచి విడుదల చేసిన నాచే నాచే సాంగ్ నెట్టింటిని షేక్ చేస్తుందని తెలిసిందే. అయితే యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ప్రభాస్ అండ్ హీరోయిన్స్ టీంతో చిట్ చాట్ చేశాడు. ఈ సందర్భంగా డిస్కో డ్యాన్సర్ నుంచి ఐకానిక్ హిందీ సాంగ్‌ను రాజాసాబ్‌లో పెట్టాలనేది ఎవరి ఐడియా అని సందీప్ రెడ్డి వంగా ప్రభాస్‌ను అడిగాడు. దీనికి స్పందించిన ప్రభాస్ నాచే నాచే తన ఫేవరెట్ సాంగ్స్‌లో ఒకటి అని.. రాజాసాబ్‌లో ఈ పాట పెట్టింది డైరెక్టర్ మారుతి అని చెప్పాడు. చాలా మంది అనుకున్నట్టు నాచే నాచే సాంగ్ మూవీ ఎండ్ క్రెడిట్స్‌లో కనిపించదని ఇప్పటికే డైరెక్టర్ మారుతి చెప్పడంతో.. ఇంతకీ నాచే నాచే పాట రాజాసాబ్ చిత్రంలో ఏ సందర్భంలో వస్తుందంటూ చర్చించుకోవడం మొదలుపెట్టారు సినీ జనాలు . మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన రాజాసాబ్ పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్స్‌కు మంచి స్పందన వస్తోంది. రాజాసాబ్ గ్లింప్స్‌లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతూ నయా లుక్‌లో కనిపిస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌కు విజువల్ ట్రీట్ ఇస్తున్నాడు. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. రాజాసాబ్‌లో సంజయ్ దత్ సంజూబాబా పాత్రలో కనిపించబోతున్నాడు.

## నాన్‌స్టాప్ నవ్వులు గ్యారెంటీ

‘ఈ సంక్రాంతికి ఇంటిల్లిపాదిని నవ్వించేలా ఈ సినిమా రూపొందించాం. ప్రేక్షకుల్ని నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది. అదే సమయంలో భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది’ అన్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన తాజా చిత్రం ‘అనగనగా ఒక రాజు’ ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. మారి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. మీనాక్ష చౌదరి కథనాయిక. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ‘అనగనగా ఒక రాజు..ఆ రాజుకి చాలా పెద్ద మనసు. ఆ మనసులోకి ధగధగా మెరిసిపోయే నగలు వేసుకొని యువరాణి దిగింది’ అంటూ నాగార్జున వాయిస్ ఓవర్‌తో మొదలైన ట్రైలర్ ఆసాంతం వినోదాత్మకంగా సాగింది. జమీందారి మనవడు రాజు పాత్రలో నవీన్ పొలిశెట్టి నవ్వుల్ని పంచారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు కలర్‌ఫుల్ విజువల్స్‌తో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ ‘ట్రైలర్ మాదిరిగానే సినిమా మొత్తం పంచ్‌లు, వ్యంగ్యంతో నవ్విస్తుంది. పండగకు కావాల్సిన అన్ని అంశాలు ఇందులో ఉంటాయి’ అన్నారు. హీరో నవీన్‌ను కొత్తగా చూస్తారని, ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అని దర్శకుడు మారి పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, దర్శకత్వం: మారి.

